ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో నేషనల్ ఐపీ యాత్ర

నేషనల్ ఐపీ యాత్రలో కార్యక్రమం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మర్రిలక్ష్మణ్‌రెడ్డి, తదితరులు

దుండిగల్,డిసెంబర్8: నగరశివారు, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిలక్ష్మన్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో మేధోసంపత్తి హక్కులు(ఐపీఆర్)పై శుక్రవారం అవగాహన సదస్సు ప్రారంభమైంది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఐపీ యాత్ర-20023 పేరిట రెండు రోజుల పాటు ఈ సదస్సు జరుగనుంది. ఈ సందర్భంగా భారతీయ ఆర్థిక వ్యవస్థలోని సృజనాత్మక మేధస్సును ప్రోత్సహించడంలో భాగంగా ఈ సదస్సు నిర్వహిస్తుంది. శుక్రవారం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సుమారు 150 మందికి పైగా చిన్న వ్యాపారులు, విద్యార్థి వ్యవస్థాపకులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి, వ్యాపారవర్గాల్లో నూతన ఆవిష్కరణలు, వాటికి సంబందించిన పేటెంట్ హక్కులపై అవగాహన కల్పించడంతో పాటు అందుకు కావాల్సిన నైపుణ్యాభివృద్ధిని నేర్పించనున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఆర్ఐటీ కళాశాల చైర్మన్ మర్రిలక్ష్మన్‌రెడ్డి మాట్లాడుతూ.. పేటెంట్ల ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డా.కే,శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. తమ కళాశాలలో చుదవుకుంటున్న విద్యార్థులు అన్నిరంగాలల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. కళాశాల డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, డా.రాధికాదేవి, డా.ఎం,గుప్తా, డా.నర్సింహులు, డా.వై,బలరాం, కో-ఆర్డినేటర్ డా.వివేకానంద్ కార్యక్రమంలో పాల్గొనగా ఎస్.గొల్లకోట ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

గణపతి ఆలయ వార్షికోత్సవం

మలక్‌పేట హరిహర మైసమ్మ క్షేత్రంలోని గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో గణపతి హోమం, అభిషేకం, వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు నిర్వహించిన హోమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సైదాబాద్, డిసెంబర్ 8

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

దుండిగల్, డిసెంబర్ 8 : ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని దుండగులు బంగారు, వెండి ఆభరణాలను తస్కరించారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, చర్చి గాగిల్లాపూర్‌లోని సెయింట్ మేరీస్ స్ట్రీట్‌లో నివాసముంటున్న గుండాన రస్యయ్య ఈ నెల 4న ఇంటికి తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి నిజాంపేట్‌లోని తనకొడుకు ఇంటికి వెళ్లి మూడురోజులు అక్కడే ఉన్నాడు. తిరిగి గురువారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. అప్పటికే ఇంటి ప్రధాన ద్వారం తలుపుగడియ విరగ్గొట్టి ఉండటంతో ఆందోళనతో ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా అందులో దాచిన మొత్తం 3తులాల బంగారు ఆభరణాలు, 750 గ్రాముల వెండి వస్తువులు సైతం చోరీకి గురైనట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును కలిసిన నియోజకవర్గ ప్రజలు

దుండిగల్,డిసెంబర్8: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శంభీపూర్‌రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు ఆయన కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు.తమ సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ ప్రజాసమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కరించేలా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, సంక్షేమసంఘాల ప్రతినిధులు ప్రజలు ఉన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ త్వరగా కోలుకోవాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 8 : తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కిందపడి కాలుకు గాయం కావడం బాధాకరమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కాలుకు గాయంతో వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్ తెలంగాణ ప్రజలందరి దీవెనలతో త్వరగా కోలుకోవాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

రేపు ఉచిత మెగా హెల్త్ క్యాంప్

అత్తాపూర్, డిసెంబర్ 8 : ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఈ నెల 10వ తేదీన నిర్వహిస్తున్నట్లు పూర్ కేర్ పోలి క్లీనిక్ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ జనప్రియ ప్రాంతంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ హెల్త్ క్యాంప్ కొనసాగుతుందన్నారు. పొల్మొంటరీ ఫంక్షన్ టెస్ట్, అడల్ట్ వ్యాక్సినేషన్ ఎడ్యుకేషన్ సెంటర్, రాన్‌డమ్ బ్లడ్ షుగర్, జనరల్ హెల్త్ చెకప్స్ తదితర పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు. డాక్టర్ రోహిత్‌రెడ్డి, డాక్టర్ శారదలు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

పార్కుల అభివృద్ధికి కృషి

పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్,డిసెంబర్8: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో గాయత్రినగర్ లోని పార్కుల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్ పార్కు లో రూ.85లక్షల వ్యయంతో జరుగుతున్న సుందరీకరణ పనులను అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గాయత్రినగర్, ఆర్‌కే సొసైటీలోని పార్కులను ప్రజలకు ఉపయోగపడే విధంగా వాక్ ట్రాక్లు, ఓపెన్ జిమ్ తోపాటు పచ్చదనం తో సుందరీకించామని తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, జ్ఞానేశ్వర్, యోగారాజు, రాజు తదిరతులు పాల్గొన్నారు.

రేపు మణికొండ రెడ్డి ఫౌండేషన్ కార్తిక వనభోజనాలు

మణికొండ, డిసెంబర్ 8: మణికొండ రెడ్డి ఫౌండేషన్(ఎంఆర్ఎఫ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన కార్తిక వనభోజన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం నార్సింగిలోని కేపీఎంఆర్ ఫ్రైడ్ గార్డెన్స్‌లో ఈ మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.

10న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

మేడ్చల్/జవహర్‌నగర్, డిసెంబర్ 8 : జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ఈ నెల 10న నిర్వహించనున్నట్టు మేడ్చల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కూరపాటి రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శామీర్‌పేటలోని స్పోర్ట్స్ పాఠశాలలో 14,16 ఏండ్లలోపు బాలబాలికలను పరుగుపందెం, జంపింగ్, త్రోయింగ్ అంశాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేయనున్నట్టు తెలిపారు. అత్యంత ప్రతిభ కనబర్చిన 13 మంది క్రీడాకారులు గుజరాత్‌లో జరిగే 19వ జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు 10న ఉదయం 7 గంటలకు తెలంగాణ క్రీడా పాఠశాలలలో రిపోర్టు చేయాలని, పూర్తి వివరాలకు 9849612733 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో

కూరగాయ	ధర (కిలో)	కూరగాయ	ధర (కిలో)
టమాట	15	ఆలుగడ్డ	23
వంకాయ	23	కీరా	18
బెండకాయ	45	దోసకాయ	23
పచ్చిమిర్చి	35	సోరకాయ	9
బజ్జి మిర్చి	45	పొట్లకాయ(1)	18
కాకరకాయ	32	కందగడ్డ	50
బీరకాయ	40	ఉల్లిపొరక	33
క్యాబేజి	15	ఉల్లిగడ్డ	34
ఫ్రెంచ్ బీన్స్	45	మామిడికాయ	15 నుంచి 20
క్యారెట్	35	అరటికాయ	8 నుంచి 9
కాలీఫ్లవర్	18	చామగడ్డ	40
దొండ	40	ముళ్లంగి (1)	4 నుంచి 6
చిక్కుడు	50	మొరంగడ్డ	18
గోరుచిక్కుడు	40	గుమ్మడికాయ	11
బీట్‌రూట్	33	నిమ్మకాయలు	32 నుంచి 36
క్యాప్సికం	45	మునగకాయ	6 నుంచి 8
పచ్చి బఠాని	45	పుట్టగొడుగులు(200గ్రా)	40
పొప్పడికాయ	40	ఎండుమిర్చి	280
అల్లం	160	వెల్లుల్లి	260

కేపీహెచ్‌బీకాలనీ : ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఓటర్ల సవరణను సమర్థవంతంగా చేపట్టాలి

రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశమైన ఉప కమిషనర్ రవికుమార్

బండ్లగూడ, డిసెంబర్ 8 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఓటర్ల సవరణలు సమర్థవంతంగా చేపట్టాలని బీఎల్ఓ సూపర్‌వైజర్లను రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో బీఎల్ఓ సూపర్‌వైజర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ వారికి తగిన సూచనలు చేశారు. 1 జనవరి 2024 వరకు 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవచ్చన్నారు. దీంతో పాటు ఇప్పటివరకు ఉన్న ఓటరు జాబితాలో తప్పు ఒప్పులను సరిదిద్దాలన్నారు. ఓటరు జాబితాలో రెండు చోట్ల పేర్లు నమోదు అయి ఉండటం, మరణించిన వారిని గుర్తించి వారి పేరును ఓటరు జాబితా నుంచి తొలగించడం, ఓటరు జాబితాలో ఉన్న పేర్లు దగ్గరగా ఉన్న పోలింగ్ స్టేషన్లకు మార్చడం వంటి సవరణలు ఈనెల 20వ తేదీలోపు సరిదిద్దాలని వారిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీ రాజారాణి ఉన్నారు.